# పెళ్లాన్ని విమర్శించకు!

"ఏం ఆవిడ ఎవర్ని పెళ్ళాడిందో కాస్త గమనించి మరీ ఆవిడ తెలివి తేటల్ని విమర్శించు" అనే అర్థంవచ్చే సూక్తి నొకటి యిటీవల ఓ తెలివైన డాక్టరుగారు తను కూర్చునేచోట నెత్తిమీద నలుగురికీ కన పడేలా ఆసుపత్రిలో తగిలించారు. ఇది మగాళ్ళ నోరుకట్టేయడానికి కని బెట్టినసూక్తి. ఇందులో నిజవే వుందా చమత్కారవే వుందా అని వచ్చిన పేషంట్లు డైలమాలో పడిపోతుంటారు.

ఇది మగాళ్ళకు పనికివచ్చే ముక్క కాదు అని చూసీ చూడగానే తెలిసిపోతుంది. ఇది చూసి దీని అర్థం సవ్యంగా బోధపడ్చుగుంటే ఆడాళ్ళు మగాళ్ళనెత్తిమీదెక్కి కూర్చుని "చల్ చలోరె ఠింగణాఘోడా అనొచ్చు, మళ్ళీ చెబ్తున్నా—"

డోంట్ క్రిటిసైజ్ యువర్ వైఫ్'స్ జడ్జిమెంట్- లుక్ హూం షి మారీడ్.

ఆఫ్టరాల్ నిన్నేకదా ఆవిడ పెళ్ళాడింది. నువ్వు ఆవిడ చవట అనుకుంటే ఆవిడ చవటకాబట్టే నిన్ను పెళ్ళాడింది అని అర్థం వస్తుంది. కొంచెం డేంజర్— అలా కాకుండా మీ ఆవిడ చాలా తెలివైనది అను కుంటే అంత అఖండమైనతెలివైన ఆవిడ నిన్ను పెళ్ళాడిందంటే నువ్వు చాలా గొప్పవాడివో, అదృష్టవంతుడివో, తెలివైన పురుషుడివో అయి వుండాలి. ఇలా అనుకోవడాన్నిబట్టేగదా లోకం నడుస్తోంది. అంచేత ఓయి వెర్రివెధవాయా "పెళ్ళాన్ని బయట పడేసుకోకు. ఆవిడ విషయ ములో చాల జాగ్రత్తగా మెసులుకో. నిస్సందేహముగా ఆవిడ తెలివై నదే ... నిన్ను పెళ్ళాడిన స్త్రీని నువ్వు లోకువ చేసుకోకు. ఆవిడ జడ్జి

మెంటు తప్పని నువ్వు రుజువుచేయడానికి ప్రయత్నిస్తే నీ కొంప మునుగుతుంది. మొగుడూ పెళ్ళాల "యవ్వారం" ఎంత సున్నితమైనదో గ్రహించి ఆ ప్రకారం జాగ్రత్తగా మెసులుకో అని దీని తాత్పర్యం.

ఇద్దరం ఒకటే— మనమిద్దరమూ తెలివైనవాళ్ళమే. అలా అనుకుని గడుసుతనంగా వుండండ్రా కుర్రవాళ్ళూ అని ఈ పైసూక్తి దంపతులను అందులో ముఖ్యంగా మిస్టర్ మగాడ్ని హెచ్చరిస్తోంది.

జీవితంలో గడుసుతనం, తెలివితేటలూ ముఖ్యం కాని విమర్శ ముఖ్యంకాదు. ఒకళ్ళనొకళ్ళు ఎద్దేవా చేసుకుంటూ ఎత్తిపొడుచుకుంటూ జీవితాన్ని నరకంచేసుకునేకంటే "నా పెళ్ళావూ తెలివైనదే- నేనూ తెలివైనవాడ్నే" అనుకుంటే రోజులు వెళ్ళిపోతాయి.

పెర్ముటేషన్స్, కాంబినేషన్స్ ప్రకారం ఆలోచిస్తే ప్రపంచంలో ఏ ఆడదాన్ని ఏ మగాడు పెళ్ళాడినా, ఏ ఆడది ఏ మగాడ్ని పెళ్ళాడినా జీవితం ఒకలాగేవుంటుంది. వారి వారి స్వభావాలు మారవు. మొగుడ్ని ఏడిపించే ఆడది ఏ మొగుడ్నైనా ఆస్ట్రేలియావాడైనా, ఆఫ్రికావాడైనా ఏడిపించితీరుతుంది. పెళ్ళాన్ని చితకతన్నేవాడ్ని అది బెట్టీ డేవిస్సైనా మర్లిన్ మన్రో చెల్లలైనా, గ్రేటాగార్బో మనవరాలైనా, వైజయంతీమాలైనా, విజయలలితైనా, అప్పలనరసమ్మైనా ఒకటే— తన్నవలిసొచ్చినపుడు తన్ని మరీ మాట్లాడ్తాడు.

మూర్ఖులకు అందచందాలతోనూ మంచిచెడ్డలతోనూ పనేమీ వుండదు. ఎవరి స్వభావానుగుణంగా వారు నడుచుకుంటారు. తమ్ము తాము సమర్థించుకోవడానికి, ఎన్నో రకాల వేషాలు వేసి లోకాన్ని వంచిస్తూంటారు. సుఖసంసారమని కాని విజయవంతమైన జీవితమనికాని ఏదీ లేదు. అంతా వంచనాశిల్పమే— ఎవరు ఎవర్నిపెళ్ళాడినా జీవితంలో సుఖపడతారని గ్యారంటీ ఏమీలేదు.

మరెందుకైతే ఈ ఉద్ధరింపులూ, వ్యాసాలూ, ఉపన్యాసాలూ.... కంఠశోషేకదా! అవును అంతే— అన్ని సుభాషితాలుచెప్పిన భర్తృహరే

''జీర్ణమంగే సుభాషితం'' (నీ సుభాషితాన్ని నువ్వే దిగమింగివూరుకో) అన్నాడు.

రాజులు మత్తులు. ప్రజలు మూర్ఖులు, విద్వాంసులు మత్సర గ్రస్తులు_ ఎవరికిచెప్తావు నీ సోదె_ ఎవరు వింటారు? ఎవరిక్కావాలి? ఎవరి బ్రతుకు వారిది; ఎవరి గొడవ వారిది; ఎవరు క్రింద? ఎవరు మీద? ఎవరు ముందు? ఎవరు వెనుక? ఎవరు గొప్ప? ఎవరు తక్కువ? ఎవరు చిన్న? ఎవరు పెద్ద? అంచాత నోరుమూసుకుపడుండు. నీ అదృష్టాదృష్టాలకి నీ పెళ్ళాన్నెందుకు విమర్శించడం— పెళ్ళాన్ని విమర్శించకు.

పెళ్ళాన్ని విమర్శించకు అనే సూక్తిలో, పెళ్ళాన్ని పొగుడు అని ఏవన్నా రూలువుందా అనే అనుమానంకలుగుతోంది. పొగిడితే ఆడాళ్ళు సులువుగా బుట్టలో పడ్తారు. పెళ్లాల్ని, వాళ్ళ తెలివితేటల్ని మెచ్చుకోకుండా వాళ్ళతో కాపురాలుచేయడం ఎలాసాధ్యం? వాళ్ళ చీరెల్ని వాళ్ళ సౌందర్యాన్ని, వాళ్ళ తెలివితేటల్ని పొగిడితే లాభంవుంది. తిడితే నష్టం. ఆడదానితో పోరు నష్టవూ ఆడదానితో, పొందు లాభవూనని వేరే చెప్పాలా?

పెళ్ళాన్ని విమర్శించకు అనేమాటలో ఇతర లేడీస్‌ని, వాళ్ళ తెలివితేటల్నీ విమర్శించొచ్చనేగా అర్థం -- పెళ్లాన్నొదిలేసి మిగతా లేడీస్ జడ్జిమెంట్‌ను విమర్శించు ఫరవాలేదు. పొగడ్త లాభించినట్లు విమర్శ లాభించదు గనుక విమర్శించేది పరాయివాళ్ళనే గాని పెళ్లాల్ని గాకుండా చూసుకోవడం మర్యాదకు మొదటి లక్షణం.

ఇది తిరగేస్తే_ మొగుళ్ళను భార్యలు ఎద్దేవా చేయొచ్చు. వాళ్ళ తెలివితేటల్ను బెరా మీటర్లో కొలిచి విమర్శించొచ్చు.... అయితే ఎంత వరకు? పవిత్రసూత్రానుబంధం తెగేంతవరకూ కాదు అని వేరే చెప్పనక్కర్లేదు.

పెళ్ళామంటే బెటర్ హాఫ్‌కదా. బెటర్ హాఫ్‌తో బెటర్‌గానే డీల్ చెయ్యాలి. బిట్టర్‌నెస్ కూడదుగాక కూడదు.

డాక్టరుగారు పెళ్లాన్ని విమర్శించకు అని బోర్డు తగిలించి తమషా చిత్తగిస్తున్నారు. కాని అందరు పేషంట్లకూ అంత పేషన్సు ఎక్కడ వుండి చస్తుంది? సన్నటివాళ్ళను పొగిడితే యింకా పొడవెక్కుతారు. లావుపాటి సుందరమ్మలను పొగిడితే యింకాలావవుతారు. పొగిడి వాళ్లని గోతుల్లోకి తోసెయ్. కాని విమర్శించి చెడ్డవాడ్ననిపించుకోకు. కుటుంబాల్లో 'విమర్శ' అనే పదం పత్రికల్లో వాడినట్లుగా వాడరు. అక్కడిది సాధింపుక్రింద వస్తుంది. తప్పు పట్టడం, వెక్కిరించడం, తాళికట్టిన దాన్నే ఎగతాళి చెయ్యడం, కూకలెయ్యడం, కేకలెయ్యడం యివేవీకూడదు సంసారంలో. ఇంతచేశావా భగవంతుడా అని లోపల అనుకుని నోరుమూసుకు పడుంటే సంసారంలో రవ్వా-రట్టూ వుండదు.

పెళ్ళాం దగ్గిర ఉగ్ర వాదం పనికిరాదు. భక్తి మార్గమే శరణ్యం అని చెప్పక చెబుతోంది, డాక్టరుగారి ఆసుపత్రిలో బోర్డు.

''కోపమేల రాధా

దయజూడవేలనాపై" అంటే పోయేదానికి చిందులు తొక్కడం దేనికి, కృష్ణుడు యెంతసేపూ గీతోపదేశం అర్జునుడికే చేశాడుకాని ఈ నాలెడ్జి, ఈ తెలివితేటలు యింట్లో పెళ్ళాలముందు పని కొచ్చాయి గావు కావల్ను. జాంబవతికిగాని, సత్యభామకిగాని వీళ్ళెవరికీ లెక్చర్లక్కర్లేదు, అసలు శాస్త్రీ కృష్ణుడే కావాలి. కృష్ణుడుకూడా దేరింగుగా ఏ పెళ్ళాన్నీ విమర్శించలేదు. సత్యభామా విధేయుడ్నని గ్రాండ్‌గా చెప్పుకున్నాడు రోడ్డెక్కి.

భూమికి వున్నంత ఆకర్షణశక్తి భామకుంది. ఇది న్యూటన్ కనిపెట్టక ముందే మనవాళ్ళు కనిపెట్టేశారు. భూమిమీద నడుస్తున్నామంటే భూమి ఆకర్షణ శక్తికి లొంగిపోబట్టేకదా— అలాగే పెళ్ళానికి

లొంగిపోవడం ఆన్ సైంటిఫిక్ కానేరదు. ఈ సృష్టిలో వైద్యం, కళలు, నేతపని. వ్యవసాయం, పరిశ్రమలు, వ్యాపారం ఆదిలో కనిపెట్టినది స్త్రీయేనని చాలా మందికి తెలీదు. సృష్టిని స్త్రీయే లొంగదీసుకుంది గనుక నువ్వో లెక్కకాదు. బేషరతుగా గృహ లక్ష్మికి లొంగిపో—మరి మాట్లాడకు, డోంటాక్!